సాక్షి
సూర్యాపేట

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



పత్తి సాగుపై అవగాహన
వర్ధమానుకోట గ్రామంలో కేవీకే గడ్డిపల్లి ఆధ్వర్యంలో శనివారం పత్తిసాగుపై రైతులకు అవగాహన కల్పించారు.
- 8లో



70 సీట్లు రాబోతున్నాయి
కాంగ్రెస్‌కు 70 సీట్లు రాబోతున్నాయని మల్కాజ్‌గిరి అభ్యర్థి ఎం.హనుమంతరావు ధీమా వ్యక్తం చేశారు.
- 10లో



సమస్యల పరిష్కారానికి పోరు
సమస్యల పరిష్కారానికి పోరాడుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు.
- 10లో

ఫలితాలు నేడే..

గెలుపు వీరులు ఎవరో..

- ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- మధ్యాహ్నం తర్వాత పూర్తి ఫలితాలు వెలువడే అవకాశం
- సూర్యాపేట కొత్త మార్కెట్‌లో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ



పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు తదితరులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): అసెంబ్లీ సాధారణ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల జాతకం తేల్చే ఘడియలు మరికొద్ది సేపట్లో ప్రారంభం కానున్నాయి. ఎవరు విజేతలో.. ఎవరు పరాజితులో ఆదివారం మధ్యాహ్నం వరకు తేలనుంది. ఉదయం 8 గంటలకు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు చెందిన ఓట్ల కౌంటింగ్ సూర్యాపేట కొత్త వ్యవసాయ మార్కెట్లో ప్రారంభంకానుంది. కౌంటింగ్‌కు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏర్పాట్లు, బందోబస్తును శనివారం కలెక్టర్ ఎస్.వెంకట్రావు, ఎస్పీ రాహుల్ హెగ్డే ప్రత్యేకంగా పర్యవేక్షించారు.

టేబుళ్ల వారీగా లెక్కింపు

ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి ఒక్కో రౌండ్‌లో 10 వేల నుంచి 12 వేల ఓట్ల వరకు లెక్కించనున్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో 271 పోలింగ్ కేంద్రాలు, తుంగతుర్తిలో 326 , కోదాడలో 296, హుజూర్‌నగర్‌లో 308 కేంద్రాలున్నాయి. హుజూర్‌నగర్ నియోజకవర్గం ఓట్లను ఒక్కో రౌండ్లో 18 టేబుళ్లపై లెక్కిస్తారు. కోదాడ్లో 16 టేబుళ్ళు, సూర్యాపేటలో 14, తుంగతుర్తిలో 18 టేబుళ్లపై లెక్కించనున్నారు. ఇందుకోసం టేబుల్‌కు ఒక్కరి చొప్పున సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లుంటారు. వీరుకాక సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు ఒక జనరల్ అబ్జర్వర్, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు ఒక జనరల్ అబ్జర్వర్‌ను నియమించారు. ఒక్కో నియోజకవర్గానికి ఆర్వో కూడా ఉంటారు

రౌండ్ల వారీగా..

ఎన్నికల ఫలితాలు రౌండ్ల వారీగా వెలువడనున్నాయి. హుజూర్‌నగర్ నియోజకవర్గం 18 రౌండ్లు, కోదాడ 19, సూర్యాపేట 20, తుంగతుర్తి 18 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి కానుంది. ఒక్కో రౌండ్ 15 నుంచి 20 నిమిషాల్లో లెక్కింపు పూర్తవుతుంది. రౌండ్ల వారీగా చూస్తే తక్కువగా 18 రౌండ్లు హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గానికి ఉన్నాయి. ఈ నియోజకవర్గ పూర్తి ఫలితం మధ్యాహ్నం 1:30 గంటలకు బయట పడనుంది. ఆ తర్వాత కోదాడ, సూర్యాపేట పూర్తి ఫలితాలు వరుసగా వెలువడుతాయి.



సూర్యాపేట నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పోలైన ఓట్లు	రౌండ్లు	అభ్యర్థులు
హుజూర్‌నగర్	308	2,14,012	18	24
కోదాడ	296	2,06,676	19	34
సూర్యాపేట	271	2,03,624	20	20
తుంగతుర్తి	326	2,23,496	18	14

అభ్యర్థులు, పార్టీల శ్రేణుల్లో ఉత్కంఠ

పార్టీల వారీగా అభ్యర్థుల ప్రకటన, ఎన్నికల నోటిఫికేషన్..అభ్యర్థుల హోరాహోరీ ప్రచారం, పోలింగ్.. చివరకు ఓట్ల లెక్కింపుతో జాతకం మరికొన్ని గంటల్లో బయటపడనుంది. అయితే పోలింగ్ సరళి చూసుకున్న అభ్యర్థులకు దడ పుడుతోంది. గ్రామాల్లో, పట్టణంలో గతంలో మాదిరిగానే పోలింగ్ శాతం ఉండడంతో అసలు విజయం ఎవరిదన్నది జోరుగా చర్చసాగుతోంది. ప్రధానంగా పల్లె ఓటర్ల నాడి ఎలా ఉందో ఎవరికీ అంతు చిక్కడం లేదు. పట్టణాల్లో గతంలో మాదిరిగా పోలింగ్ శాతం ఉండడంతో ఈ ఓట్లు ఏ పార్టీకి పడ్డాయన్నది రాజకీయ విశ్లేషకులకు ప్రశ్నార్థకంగా మారింది. పోలింగ్ సరళితో ఫలానా మండలం పట్టణంలో తమకే లీడ్ వస్తుందని అభ్యర్థులు అంచనాలు వేసుకున్నారు. కానీ చివరకు తమ అంచనాలు ఏమవుతాయోనన్న ఆందోళన వారిలో నెలకొంది. అయితే, ఎవరికి వారు గెలుపు తమదేనని ప్రధాన పార్టీల శ్రేణులు మాత్రం జోరుగా బెట్టింగ్‌లు కాస్తున్నాయి.

ఇలా మొదలవుతుంది..

స్ట్రాంగ్ రూముల్లో సీరియల్‌గా భద్రపరిచిన ఈవీఎంలను 1వ నంబర్ పోలింగ్ బూత్ వారీగా లెక్కిస్తారు. ఇలా చూస్తే సూర్యాపేట నియోజకవర్గంలో తొలుత సూర్యాపేట రూరల్ పోలింగ్ బూత్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత వరుసగా సూర్యాపేట టౌన్, చివ్వెంల, పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్) మండలాలుంటాయి. కోదాడ నియోజకవర్గంలో మోతె మండలం నుంచి ప్రారంభమై మునగాల, చిలుకూరు, కోదాడ టౌన్, అనంతగిరి, కోదాడ టౌన్, కోదాడ రూరల్, నడిగూడెం, అనంతగిరి, నడిగూడెం మండలాలతో పూర్తి అవుతుంది. తుంగతుర్తి నియోజకవర్గంలో మోత్కూరు మండలం నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత వరుసగా అడ్డగూడురు, శాలిగౌరారం, జాజిరెడ్డిగూడెం, నూతనకల్, మద్దిరాల, తుంగతుర్తి, నాగారం, తిరుమలగిరి మండలాలుంటాయి. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో నేరడుచర్ల మండలంతో ప్రారంభమై వరుసగా పాలకవీడు, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం, హుజూర్‌నగర్, గరిడేపల్లి మండలాల ఓట్ల లెక్కింపుతో ప్రక్రియ ముగుస్తుంది.

న్యూస్‌రీల్

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

భానుపురి (సూర్యాపేట): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో సోమవారం వరంగల్‌కు చెందిన మ్యాక్సీ విజన్ శరత్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం సూర్యాపేట అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ పరీక్షలకు జిల్లాలోని పెన్షనర్లు తమ హెల్త్ కార్డు వెంట తెచ్చుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



సువర్ణ పుష్పార్చన మూర్తులకు హారతిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. ఆచార్యులు వేకువ జామున ఆలయాన్ని తెరిచి శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చ, అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం జోడు సేవలను మాఢవీధిలో ఊరేగించారు. కార్తీకమాసం కావడంతో భక్తులు దీపారాధన, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

మహిళలపై హింసను అరికట్టాలి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

నకిరేకల్ : మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని స్త్రీల వైద్యనిపుణల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ రాపోలు మంజుల కోరారు. మహిళపై హింస నివారణ దినోత్సవం సందర్భంగా నకిరేకల్‌లో శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహిళలు, యువతులు, విద్యార్థినులపై ఇంకా శారీరక, మానసిక, లైంగిక దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పాలక ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలను తెచ్చి మహిళలపై హింస జరగకుండా అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సుచరిత్ర, శ్రీకాంత్, సిబ్బంది వినయ్‌కుమార్, హరీష్, శివ, జయ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధం ఊరేగింపు

భువనగిరిటౌన్ : పట్టణంలోని దర్గా హజరత్ లాల్‌షా వలి బాబా రహెమతుల్లా అలై దర్గా గంధం ఊరేగింపు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాతె షరీఫ్ పఠిస్తూ ఫకీర్‌ల విన్యాసాల మధ్య ఇస్లాంపూర మసీదు నుంచి పోస్టాఫీస్ సమద్ చౌరస్తా మీదుగా దర్గా వరకు ఊరేగింపు కొనసాగింది. భక్తులు దర్గాపై పూలచాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా ముతవల్లి ఎండీ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా గంధం ఊరేగింపు ఘనంగా నిర్వహించామని, కుల, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు అహ్మద్ జమాల్ షరీఫ్, ఫారూఖీ, సురేష్, రమ్మీబాయ్, రఫిఖ్ తదితరులు పాల్గొన్నారు.



గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఆర్టీసీకి కలిసొచ్చిన ఎన్నికలు

- అసెంబ్లీ పోలింగ్ సందర్భంగా రూ.4.37 కోట్ల ఆదాయం



నల్లగొండ రూరల్ : ఆర్టీసీకి ఎన్నికల ఆదాయం దండిగానే సమకూరింది. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా సిబ్బంది, సామగ్రిని కౌంటింగ్ కేంద్రాలకు చేర్చడం.. తిరిగి తీసుకురావడం ద్వారా రూ.4,37,22,000 ఆదాయం సమకూరింది. నవంబరు 29, 30 తేదీలు, డిసెంబరు1 తేదీల్లో ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ మొత్తం 317 బస్సులను నడిపింది. వీటిలో దేవరకొండ డిపో నుంచి 53 బస్సులు, నల్లగొండ నుంచి 41, మిర్యాలగూడ 44, యాదగిరిగుట్ట 65, కోదాడ 56, సూర్యాపేట నుంచి 58 బస్సులు నడిపారు. తేదీల వారీగా.. నవంబరు 29న రూ.96.21 లక్షలు, 30న 207.63 లక్షలు, డిసెంబరు 1న 133.38 లక్షల ఆదాయం సమకూరిందని ఆర్టీసీ ఆర్‌ఎం.శ్రీదేవి తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



బొలగాని భవ్య

సూర్యాపేట రూరల్: ఆసిఫాబాద్‌లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అండర్-14 ఖోఖో టోర్నమెంట్‌కు సూర్యాపేట మండలం బాలెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొలగాని భవ్య ఎంపికై నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం జెల్లా ప్రసాద్ తెలిపారు. శనివారం పాఠశాలలో శివరాత్రి భిక్షపతి జ్ఞాపకార్థం శివరాత్రి శేఖర్ సౌజన్యంతో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఆమె ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందలు తెలిపారు.

మద్యం దుకాణాల వద్ద బారులు



వైన్స్ వద్ద బారులుదీరిన మద్యంప్రియులు

అర్వపల్లి: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆదివారం మద్యం దుకాణాలను బంద్ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో మందుబాబులు ముందస్తుగా శనివారం మద్యం కొనేందుకు దుకాణాల వద్ద బారులుదీరారు. అర్వపల్లిలో 3 దుకాణాలుండగా శనివారం రాత్రి ఎగబడ్డారు. మరికొద్ది గంటల్లో ఎన్నికల ఫలితాలు వెలువడనుండడంతో వివిధ పార్టీల శ్రేణులు విజయోత్సవాలు జరుపుకోవడానికి మద్యాన్ని కొనుగోలు చేసి నిల్వ పెట్టుకున్నట్టు సమాచారం. అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొడడంతో శనివారం రాత్రే ఆయా దుకాణాల్లో మద్యం స్టాక్ అయిపోయినట్టు సమాచారం.

5న సాఫ్ట్ బాల్, బీచ్ వాలీబాల్ జట్ల ఎంపిక

నల్లగొండ టూటౌన్ : ఉమ్మడి జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్, బీచ్ వాలీబాల్ అండర్-19 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు ఈనెల 5న నల్లగొండలోని అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ఇందిర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు బోనఫైడ్ సర్టిఫికెట్, పదో తరగతి మెమోతో ఈ నెల 5న ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు. వివరాలకు కె.నర్సిరెడ్డి (ఫోన్ నంబర్ 9640140183)ని సంప్రదించాలని సూచించారు.

కళా ఉత్సవాలను విజయవంతం చేయాలి



తెలుగు సాహిత్య కళా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీశ్రీ కళా వేదిక సభ్యులు

భానుపురి (సూర్యాపేట): శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16 ,17 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బుద్దల కన్వెన్షన్ హాల్లో నిర్వహించే తెలుగు సాహిత్య కళా ఉత్సవాలను విజయవంతం చేయాలని మనం వికాస్ వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని సుధా బ్యాంకు ఆడిటోరియంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కళాకారులను ప్రోత్సహించేందుకు శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 30 గంటల 30 నిమిషాల 30 సెకండ్ల నాన్ స్టాప్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి, కవి రచయిత హమీద్‌ఖాన్, సింగర్ దాచేపల్లి లక్ష్మి, ప్రముఖ కార్టూనిస్టులు పల్లె మణిబాబు, ఆనంద్, దైద వెంకన్న పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కౌంటింగ్‌కు సర్వం సిద్ధం చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ సిహెచ్. ప్రియాంకలతో కలిసి ఆయన మాట్లాడారు. నాలుగు నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లలో 14 చొప్పున టేబుల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తిగా సంబంధిత పరిశీలకుల సమక్షంలో జరుగుతుందన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందన్నారు. తదుపరి ఉదయం 8.30 ఈవీఎంల లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో సెల్‌ఫోన్‌కు అనుమతి లేదని అన్నారు. కౌంటింగ్ హాళ్లలోకి సంబంధిత అధికారులు ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులు వెళ్లేలా అనుమతించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి ప్రత్యేక తర్ఫీదు ఇచ్చామని, విధుల నిర్వహణ సిబ్బంది అంతా ఉదయం 6 గంటలకు హాజరు కావాలని, 6.30 గంటలకు కౌంటింగ్ ఏజెంట్లు వస్తారని, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ 8గంటలకు లకు మొదలవుతుందని తెలిపారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో సరిపడా సిబ్బంది, రూట్లు, లోపల గ్యాలరీలు, పోస్టల్ బ్యాలెట్, వీవీ ప్యాట్ల విభాగాలు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ రోజున గెలిచిన అభ్యర్థుల ర్యాలీలు చేపట్టరాదని అలాగే మరుసటి రోజున ర్యాలీలు అనుమతులు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో నోడల్ అధికారి సతీష్ కుమార్ డీపీఆర్‌ఓ రమేష్ కుమార్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, దీనిపై ఎన్నికల అబ్జర్వర్ల పర్యవేక్షణ ఉంటుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావు అన్నారు. ఎన్నికల అబ్జర్వర్లు బాలకిషన్ ముండా, కౌశిగన్, ఆనంద్ కుమార్, హిందోల్ దత్తతో కలిసి శనివారం సూర్యాపేటలోని మార్కెట్ యార్డ్‌లో మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ ప్రక్రియలో పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. సిబ్బంది కౌంటింగ్ విధులకు వచ్చేటప్పుడు జిల్లా ఎన్నికల అధికారి ఇచ్చిన ఆర్డర్ కాపీతోపాటు ఐడీ కార్డును తప్పక తీసుకొని రావాలని సెల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. ఉదయం కౌంటింగ్ హాల్‌లో సిబ్బంది విధులను అబ్జర్వర్లు థర్డ్ ర్యాండమైజేషన్ చేస్తారన్నారు. ఈ సందర్భంగా అబ్జర్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా కొనసాగించారని సిబ్బందిని అభినందించారు. కౌంటింగ్ పక్రియనూ జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, వెంకటరెడ్డి, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

12 నుంచి తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె



నినాదాలు చేస్తున్న తపాలా శాఖ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

భానుపురి (సూర్యాపేట): ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేసి పెన్షన్‌తోపాటు అన్నిరకాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ తపాలా శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి జరిగే నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని ఆ శాఖ ఉద్యోగుల సంఘం సూర్యాపేట డివిజన్ కన్వీనర్ జి.నాగరాజు, చైర్మన్ రవి పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేటలోని సబ్ పోస్ట్ ఆఫీస్ వద్ద సమ్మెకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్లు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలన్నారు. అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాడ్యుటీ ఇన్సూరెన్స్ 5 లక్షల రూపాయలకు పెంచాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు లింగయ్య, పుల్లయ్య, సత్యం, కరుణాకర్, శుక్య, దివ్య, అఖిల, మేరి, నౌసిన్, చికిత గోపి, మల్లయ్య, ఆంజనేయులు, ప్రేమ్, లావణ్య, వెంకటరమణారెడ్డి, శ్రావణ్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నారసింహుడి కల్యాణం



స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, ప్రత్యేకార్చనలు, మూల విరా ట్‌మూర్తికి, పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం శ్రీస్వామి, శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. ఆ తర్వాత మాంగళ్య ధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, పాలకమండలి సభ్యులు కె.వెంకటనారాయణ, కొండల్‌రెడ్డి, అర్చకులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత

- 800 మంది సిబ్బందితో భారీ బందోబస్తు
- ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతిలేదు
- జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే



కౌంటింగ్ కేంద్రం బయట భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే



కౌంటింగ్ హాల్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

సూర్యాపేట క్రైం: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డె బీకే అన్నారు. జిల్లా కేంద్రంలో గల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆదివారం ఓట్ల లెక్కింపు సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును శనివారం ఎస్పీ పరిశీలించి మాట్లాడారు. 800 మంది సిబ్బందితో కౌంటింగ్ కేంద్రంతోపాటు జిల్లా అంతటా బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్మ్‌డ్ సిబ్బంది, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 144 సెక్షన్ అమలు కొనసాగుతుందని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, ఏజెంట్లు సహకరించాలన్నారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు భద్రతా సిబ్బందికి (సెక్యూరిటీ వారికి) చూపిస్తేనే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్, ఫైర్ వస్తువులు, లైటర్ల వంటి నిషేధిత వస్తువులను కౌంటింగ్ హాళ్లలోకి తీసుకెళ్లవద్దన్నారు. 12 సెక్షన్ల పారామిలిటరీ సిబ్బంది, 2 కంపెనీల సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, 2 కంపెనీల టీఎస్‌ఎస్‌పీ సిబ్బంది. 50 మంది స్టేట్ ఆర్మ్‌డ్ సిబ్బంది, అడిషనల్ ఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 40 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, సిబ్బంది విధుల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారరని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా పెంచామన్నారు. ఆయన వెంట డీఎస్పీలు నాగభూషణం, రవి, ఎస్‌బీ సీఐ రాజేష్, పట్టణ సీఐ రాజశేఖర్, రూరల్‌సీఐ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

భువనగిరి క్రైం: షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి ఓ ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన పట్టణంలోని కిసాన్‌నగర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. కిసాన్‌నగర్‌కు చెందిన మోట శ్రీశైలం కుటుంబంతో కలిసి కర్నాటక రాష్ట్రానికి పనినిమిత్తం వెళ్లాడు. తాళం వేసిన ఇంట్లో శనివారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదం సంభవించడంతో ఇల్లు దగ్ధమై ఇంట్లోని సిలిండర్ పేలడంతో భారీ నష్టం వాటిల్లింది. దీంతో స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇల్లు మొత్తం కాలిపోయింది. పట్టణంతో పాటు, మండలంలో రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరాతో తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. వ్యక్తి మృతి

శాలిగౌరారం: లారీ ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామ సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన బాలెం వెంకన్న(45) శనివారం రాత్రి నకిరేకల్ నుంచి 365వ నంబర్ జాతీయ రహదారి మీదుగా చిత్తలూరుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెర్కకొండారం గ్రామ సమీపంలోకి రాగానే వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకన్న అక్కడికక్కడే మృతిచెందాడు. లారీ డ్రైవర్ లారీని అక్కడే వదిలి పరారయ్యాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బొలేరో వాహనం బోల్తా.. పలువురికి గాయాలు

మిర్యాలగూడ: బొలెరో వాహనం బోల్తా పడగా.. నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన దామరచర్ల మండల కేంద్రం శివారులో శనివారం జరిగింది. వాడపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్లలోని యాదాద్రి పవర్ ప్లాంట్‌లో కూలీలుగా పనిచేస్తున్న సుమారు 16 మంది విధులు ముగించుకుని బొలేరో వాహనంలో దామరచర్లకు వస్తుండగా వీర్లపాలెం రహదారిలో ముత్యాలమ్మ గుడి మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడగా.. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారు బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీలుగా పోలీసులు భావిస్తున్నారు.

యాసంగికి సాగునీరందేనా !

- సగానికి పైగా పడిపోయిన శాలిగౌరారం ప్రాజెక్టు నీటిమట్టం
- వరినార్లకు దాటిపోతున్న అదును
- అయోమయంలో అన్నదాతలు

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకు తగ్గుతుండడంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. శాలిగౌరారం ప్రాజెక్టు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం రూ.5.50కోట్లు నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా పనులు అంతంత మాత్రమే జరిగాయి. ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చే రాచకాల్వ అభివృద్ధి పనులు జరగకపోవడంతో మూసీ నది నుంచి వచ్చే వరద నీరు రాకుండా పోయింది. ఫలితంగా ప్రాజెక్టులో నీటిమట్టం కనిష్టానికి పడిపోయింది. ప్రాజెక్టు ఆయకట్టులో యాసంగి పంటసాగుకు సాగునీరందే పరిస్థితి లేకుండా పోయింది. ఈ సంవత్సరం వానాకాలంలోనే పంట సాగుకు సకాలంలో నీరందించలేదని, యాసంగికి ఆలస్యమైనా సరే సాగునీరందే అవకాశం కనిపించకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. 21 అడుగుల నీటి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో ప్రస్తుతం 10 అడుగుల నీటిమట్టం కలిగి ఉంది.

అక్రమంగా విద్యుత్ మోటార్లు

30 కిలోమీటర్ల పొడవు ఉన్న ప్రాజెక్టు రాచకాల్వపై వందల సంఖ్యలో ఉన్న విద్యుత్ మోటార్లు నీటిని తోడేస్తుండటంతో రాచకాల్వలో వరదనీరు ప్రవహించడం అసాధ్యంగా మారుతోంది. ఇదిలా ఉండగా ప్రాజెక్టులో ఉన్న నీటిని ప్రాజెక్టు ఆవరణలో



10 అడుగుల నీటిమట్టంతో ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టు

ఏర్పాటు చేసిన బావుల ద్వారా ఎగువ భాగానికి తరలిస్తుండటంతో ప్రాజెక్టు నీటిమట్టం రోజురోజుకు కనిష్టానికి పడిపోతుంది.

1200 ఎకరాల విస్తీర్ణం..

శాలిగౌరారం ప్రాజెక్టు 1200 ఎకరాల విస్తీర్ణంలో 21 అడుగుల నీటిసామర్థ్యంతో 5వేల ఎకరాల ఆయకట్టును కలిగి ఉంది. ప్రాజెక్టు పరిధిలో శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, రామగిరి, శాలిలింగోటం, అంబారిపేట, గురుజాల, అడ్లూరు, ఊట్కూరు, బండమీదిగూడెం గ్రామాల్లోని 5వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం యాసంగి పంటకు సాగునీరందాలంటే ప్రాజెక్టులో కనీసం 15 అడుగుల నీటి నిల్వ ఉండాలి. కానీ ప్రస్తుతం 10 అడుగుల నీటి మట్టం మాత్రమే ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి నీరువచ్చే రాచకాల్వలో పూడికతీత పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే మూసీ నదిలో ప్రవహించే వరదనీటిని ప్రాజెక్టులోకి మళ్లిస్తే ప్రాజెక్టు యాసంగికి సాగునీరందే ఆశలు సజీవంగా ఉంటాయి.

పట్టించుకునేవారే లేరు



మూసీ నది ద్వారా ప్రాజెక్టులోకి నీరువచ్చి చేరే విషయాన్ని పట్టించుకున్న నాథుడే లేడు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంతోనే సాగునీటి కష్టాలు వచ్చాయి. వర్షాల వల్ల వానాకాలంలో పంటలకు సరిపడా నీరందింది. ఇప్పుడు యాసంగికి ప్రాజెక్టులో సరిపడా నీరునిల్వ లేకపోవడంతో యాసంగి పంటను కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఇదే పరిస్థితి కొనసాగితే ముందుముందు రైతులు పంటలు పండించుకోవడం కష్టమే.

– చింత ధనుంజయ్య, రైతు, శాలిగౌరారం

త్వరలో నీరు విడుదల చేస్తాం



శాలిగౌరారం ప్రాజెక్టులో ప్రస్తుతం 10 అడుగుల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి నీరువచ్చే రాచకాల్వలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. మరో వారం రోజుల్లో పూడికతీత పనులు పూర్తిచేసి మూసీనది నుంచి వరద నీటిని ప్రాజెక్టులోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. యాసంగి పంటసాగుకు సరిపడా నీటి నిల్వ చేరగానే ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– రాములు, ఇరిగేషన్ ఏఈ, శాలిగౌరారం ప్రాజెక్టు

పత్తి సాగుపై రైతులకు అవగాహన



వర్ధమానుకోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త ఆదర్శ

నాగారం: మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో శనివారం పత్తి పంటలో అధిక సాంద్రత పద్ధతి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి. ఆదర్శ మాట్లాడుతూ.. పత్తి పంటలో అధిక సాంద్రత పద్ధతి సాగు అవలంబించడం ద్వారా రైతులు అధిక దిగుబడి పొందవచ్చని అన్నారు. ఈ సాగును అవలంబించడం ద్వారా విత్తనాలు, మొక్క శాఖీయ పెరుగుదలను నివారించడానికి వాడే మెపిక్వాటుక్లోరైడ్, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అయ్యే ఖర్చు ఒక ఎకరానికి రూ.6,000 వరకు జాతీయ ఆహార భద్రత మిషన్ నుంచి నేరుగా రైతు ఖాతాలోకి వస్తాయని తెలిపారు. అధిక సాంద్రత పద్ధతిలో చీడపీడల యాజమాన్యం గురించి, సస్యరక్షణ చర్యలైన లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు (నీలం, పసుపు, తెలుపు రంగులు) వాటిని వాడుకునే విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. పత్తి సాగులో చేపట్టాల్సిన మెలకువలు, ఎరువుల యాజమాన్యం, మొక్క ఎదుగుదల నియంత్రికాలైన మెపిక్వాటు క్లోరైడ్ (చమత్కార్) దాని ఉపయోగాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి. నరేష్, రాశి సీడ్స్ ప్రాజెక్ట్ ఆఫీసర్ టి. నరేష్, కృషి విజ్ఞాన కేంద్రం యంగ్ ప్రొఫెషినల్స్ విక్రమ్, సంతోష్, మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

నల్లగొండ: ఓట్ల లెక్కింపునకు సిబ్బంది తుది ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు నల్లగొండ జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపు పరిశీలకులు ప్రతిపాల్ చౌహాన్, ఆర్.మనుల్‌రాజ్, జైనేంద్రసింగ్ సమక్షంలో ర్యాండమైజ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గానికి 132 మంది కౌంటింగ్ సూపర్ వైజర్స్, 132 మంది కౌంటింగ్ అసిస్టెంట్స్, 132 మంది మైక్రో అబ్జర్వర్స్‌ను కేటాయించినట్లు తెలిపారు.

రావి నారాయణరెడ్డి యాదిలో..



రావి నారాయణరెడ్డి సేవా సంస్థ నూతన కార్యవర్గం సభ్యులు

- ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం

భువనగిరి రూరల్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు 'రావి నారాయణరెడ్డి యాదిలో' పేరుతో శనివారం భువనగిరి మండలంలోని బొల్లేపల్లి గ్రామంలో గ్రామస్తులతో పాటు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. రావి నారాయణరెడ్డి నివసించిన ఇంటి ముందు జరిగిన సమావేశంలో ఆయన గొప్పతనం గురించి నేటి తరానికి తెలియజేసేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అందుకు రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ఏర్పాటు చేయాలని, బొల్లేపల్లి మరియు జిల్లా కేంద్రంలో రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహాలతో పాటు ట్యాంక్ బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని కోరాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. నారాయణరెడ్డి కట్టించిన ప్రైమరీ స్కూల్, హైస్కూల్ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో కొత్త భవనాల నిర్మించేలా ప్రభుత్వానికి విన్నవించాలని అన్నారు. ప్రతి యేటా ఆయన జయంతి రోజున విద్యార్థులను సన్మానించాలని, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

సేవా సంస్థ ఏర్పాటు..

ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి సేవా సంస్థ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుకుపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పడాల భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రావి సుకేష్‌రెడ్డి, కోశాధికారిగా తిరుమణిదాసు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి రావి హేమంత్‌రెడ్డి, సభ్యులుగా కత్రోజు విజయకుమార్, చెరుకుపల్లి మహేశ్, డాక్టర్ గడ్డం విజయభార్గవ్, ముఖ్య సలహాదారుడిగా భువనగిరి సత్యనారాయణ, సలహాదారులుగా రావి ప్రతిభ, రావి ప్రభాకర్‌రెడ్డి, మద్ది బుచ్చిరెడ్డిని ఎన్నుకున్నారు.

గుంతల దారులతో అవస్థలు



పస్తాల కల్వర్టు వద్ద కంకరతేలి పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు



కంకరలేచి గుంతలమయంగా మారిన లక్ష్మాపురం రోడ్డు

- పూర్తిగా దెబ్బతిన్న లక్ష్మాపురం, పస్తాల బీటీ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

నాగారం: మండల పరిధిలోని పస్తాల- లక్ష్మాపురం గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు పూర్తిగా దెబ్బతిని కంకర తేలి అస్తవ్యస్తంగా మారింది. ఓవైపు కంకరతేలి మరోవైపు గుంతల మయంగా మారిన ఈ రోడ్డుపై ప్రయాణానించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు తారురోడ్డు సౌకర్యం కల్పిస్తున్నామని పాలకులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. మండలంలోని పస్తాల స్టేజి నుంచి గుండెపురి వరకు, లక్ష్మాపురం, కాశీతండా, వెలుగుపల్లి వరకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారులపై రాత్రివేళల్లో వాహనదారులు గుంతల్లో పడి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. రెండు, మూడేళ్లుగా దెబ్బతిన్న రోడ్డు మరమ్మతులు చేపట్టకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. లక్ష్మాపురం నుంచి కాశీతండా, వెలుగుపల్లి, పస్తాల నుంచి గుండెపురి ప్రధాన రహదారి గుండా ప్రజలు నిత్యం వివిధ అవసరాలకు సూర్యాపేట, తిరుమలగిరి, తుంగతుర్తి, నాగారం తదితర గ్రామాలకు వెళుతుంటారు. లక్ష్మాపురం-కాశీతండాల మధ్య బస్ సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలలోనే ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. రోడ్డు పూర్తిగా కంకర తేలి, అడుగడుగునా గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



కాశీతండా నుంచి లక్ష్మాపురం, పస్తాల, గుండెపురి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకరతేలి గతుకుల మయంగా మారింది. ఈ రహదారి గుండా ప్రజలు నిత్యం సూర్యాపేట, తిరుమలగిరి, నాగారం, తుంగతుర్తికి వెళుతుంటారు. కంకర తేలిన రహదారిపై రాకపోకలు సాగించలేక వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాశీతండా నుంచి గుండెపురి వరకు నూతనంగా తారు రోడ్డును నిర్మించాలి.

– మల్లేపాక యాకయ్య, లక్ష్మాపురం

కల్వర్టు వద్ద నిత్యం ప్రమాదాలు

పస్తాల స్టేజీ నుంచి గ్రామానికి సమీపంలో ఉన్న కల్వర్టు నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. ఈ కల్వర్టు మీదుగా చెరువు నీరు నిత్యం ప్రవహిస్తుండడంతో కల్వర్టుపై గల సీసీ దెబ్బతిని, పాకురుపట్టి జారుతుండటంతో ద్విచక్ర వాహనదారులు, ఇతరులు నీటిలో జారిపడి గాయాలపాలవుతున్నారు. అలాగే కల్వర్టుకు ఇరువైపులా ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతిని భారీగా కంకర తేలి ఉంది. దీంతో వాహనదారులు దెబ్బతిన్న కంకర రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పస్తాల, గుండెపురి మధ్య నూతనంగా రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

అధ్వానంగా ఎత్తిపోతల పథకం

- మరమ్మతులకు నిధులు మంజూరు
- పనులు ప్రారంభించడంలో జాప్యం

నడిగూడెం: మండల కేంద్రం సమీపాన ఉన్న సాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా ఉన్న ఎల్-34 ఎత్తిపోతల పథకం అధ్వానంగా మారింది. మోటార్లు పని చేయడం లేదు. పైపు లైన్‌లు దెబ్బతిన్నాయి. మేజర్, మైనర్ కాలువలు పలుచోట్ల పూడి, కంప చెట్లమయంగా మారాయి. దీంతో చివరి భూములకు కూడా నీరందని పరిస్థితి నెలకొంది.



ధ్వంసమైన ఎల్- 34 ఎత్తిపోతల పథకం

ఈ పథకం కింద నడిగూడెం పరిధిలో దాదాపు 100 ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఈ ఎత్తిపోతల పథకానికి ఈ ఏడాది నీటి పారుదల శాఖ కింద అత్యవసర మరమ్మతుల కోసం రూ.15 లక్షలు మంజూరు చేసింది. కానీ నిధులు మంజూరు చేసి దాదాపు నాలుగు నెలలు కావస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పనులు చేపట్టలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రపంచ తెలుగు సాహిత్య ఉత్సవాలకు ఆహ్వానం



ఎండీ గుంషావలి

మోత్కూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడంలో ఈనెల 16, 17 తేదీల్లో జరగనున్న ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు మోత్కూరు పట్టణానికి చెందిన కవి, రచయిత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎండీ గుంషావళికి ఆహ్వానం అందింది. ఈ సాహిత్య కళా ఉత్సవాలకు తనకు వరుసగా రెండవ సారి తనకు ఆహ్వానం అందినట్లు గుంషావళి తెలిపారు. అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

- బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి

శాలిగౌరారం: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకుంటే ప్రశాంతత లభిస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారం మండలం తిరుమలరాయునిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో చాడ కిషన్‌రెడ్డి సొంత ఖర్చులతో నూతనంగా ఏర్పాటు చేయించిన ఆంజనేయస్వామి విగ్రహం వద్ద శనివారం మండలి పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ఆయన కుటుంబ సభ్యులతో కలిసి హాజరై మాట్లాడారు. దేవాలయ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని, ప్రజలు కూడా దేవాలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం దేవాలయ వంశపారంపర్య ధర్మకర్తలు కిషన్‌రెడ్డికి ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో చామల సృజనరాంరెడ్డి, జగన్, వెంకన్న, ప్రవీన్, దేవాలయ ధర్మకర్తలు శేషం నర్సింహ్మాచార్యులు, జగన్మోహనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న చాడ కిషన్‌రెడ్డి

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు





పెద్దవూర, వెల్మగూడెంలో విద్యుత్ స్తంభాలను అల్లుకున్న తీగ జాతి మొక్కలు

పెద్దవూర: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో, సమీపంలోని జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి వెంట ఉన్న విద్యుత్ స్తంభాలను తీగ జాతికి చెందిన మొక్కలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారి వెంట వెళ్తున్నా కనీసం పట్టించుకోవడం లేదు. పెద్దవూర మండలంలోని వెల్మగూడెం గ్రామంలో విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తీగ జాతికి చెందిన మొక్కలు కమ్మేశాయి. దీంతో అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నట్లు ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ ఫీజ్ కొట్టేసినప్పుడు, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో కరెంట్‌ను ఆఫ్ చేయాలన్న ఇబ్బందిగా మారింది. విద్యుత్ స్తంభాల వద్ద ఏపుగా పెరిగిన చెట్లు, తీగ జాతి మొక్కలు అల్లుకోవడం వల్ల వర్షాలు వచ్చినప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏపుగా పెరిగిన చెట్లు, తీగజాతి ఆకులను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి

భువనగిరి క్రైం: రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం భువనగిరిలోని సబ్ జైలులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎయిడ్స్ నివారణపై వైద్యారోగ్యశాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. వ్యాధిగ్రస్తులు అపోహలతో సంఘానికి దూరం అవుతున్నారని, రాజ్యాంగ హక్కులను సాధికారత చేసుకోలేకపోతున్నారని తెలిపారు. వారిని కూడా సంఘంలో మనగలిగేలా అందరూ కృషి చేయాలన్నారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగారం అంజయ్య మాట్లాడుతూ... చట్టపరమైన హక్కులపై అవగాహన ఉండాలన్నారు. ఖైదీలు నేర ప్రవృత్తిని వీడి తమ కుటుంబ శ్రేయస్సు, సమాజ పురోగతికి పాటుపడాలని కోరారు. ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.జైపాల్‌రెడ్డి, జి.శంకర్, జైలు పర్యవేక్షణ అధికారి పూర్ణచందర్ పాల్గొన్నారు.

• కౌంటింగ్‌కు ఏర్పాట్లు



నల్లగొండ సమీపంలోని దుప్పలపల్లి గోదాంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్ వద్ద పోలీసులు పహారా



నల్లగొండలో కౌంటింగ్ సెంటర్ వద్ద సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



సూర్యాపేటలోని వ్యవసాయ మార్కెట్‌లో కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన టేబుళ్లు



భువనగిరిలోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన టేబుళ్లు